# 21. ఖాళీ

అప్పటికి నావయస్సు ముప్పైఏళ్ళు. నక్షత్రశాస్త్రంలో కొన్ని పరిశోధనల్ని ఇండియా మధ్యప్రాంతాల్లో చెయ్యాల్సి వచ్చింది. ఇంగ్లీషు ప్రభుత్వం నాకు తగిన సౌకర్యాల్ని కూడా సమకూర్చింది. నాకు తెలియని ఆ పెద్దదేశంలో దిగేప్పటికి నాకు సహాయం చేసేందుకు కొంతమంది సిద్ధంగా వున్నారు.

ఇండియాలో నేను తిరిగింది వివరిస్తూ కూర్చుంటే పదిభారతాలవుతుంది. నన్ను నేను మరిచిపొయ్యే ప్రదేశాల్ని ఎన్నింటినో దాటాను; రెండునెలలపాటు ఊహలో - ఏనుగుల్ని ఎక్కి దేవలోకంలో తిరుగుతూన్నట్టన్పించింది. కీకారణ్యాలమధ్య గొప్ప శిధిలాలు, మట్టిలో దాగిన అతివిలువైన రత్నాల్లాగు దేశమంతటా వెదజల్లబడి వున్నయ్. వాటిని చూస్తూంటే - మన ఊహకు మించిన అందమైన యువతిమీద మొట్టమొదటి చూపుల్లో కలిగే ప్రేమలాటిది, శారీరకంగానూ, మానసికంగానూ కూడా పెంపొందే బాధలాంటిది అనుభవించాను. విక్టర్ హ్యూగో చెప్పినట్టు 'జాగ్రదావస్థలోనే ఉండి, స్వప్నంలో నడుస్తున్నాను' అనిపించింది.

చివరి క్యాంపులో నేను హార్టు జేరాను. పూర్వం ఇది మంచి అభివృద్ధిలో వున్న ప్రసిద్ధ పట్టణమయినా అప్పటికి శిధిలావస్థలోనే వుంది. ఆ పట్టణం ఒక ధనికుడు, స్వార్థపరుడు, క్రూరుడు అయిన రాజుచేత పాలింపబడుతోంది. అతనిపేరు రాజామదన్. అతను నీగ్రోల్లో సుకుమారత్వం గలవాడిలాగు, మగతనంలో ఆదరికం కలిసిన వ్యక్తిలాగు కనిపించాడు.

ఆ పట్టణం పెద్దలోయకు కింది భాగంలో రకరకాల దేవాలయాల చేత ఆవరింపబడ్డ సరస్సును ఆనుకొనివుంది. ఇంకోగంటకు ఆవూరు జేరుకుంటామనగా

అందంగా అలంకరింపబడ్డ ఏనుగులతోబాటు కొంతమంది రాజాగారి సేవకులు నన్ను కలుసుకున్నారు. పెద్ద గందరగోళంతో నేను ఊరు ప్రవేశించాను. ఇంత హడావిడి వుంటుందని నాకు ముందే తెలిస్తే సంతోషాన్ని వెలిబుచ్చే దుస్తుల్ని, ధరించేవాణ్ని: కాని అది రాజాగారి కోపానికి గురికావచ్చు!

రాజాగారు నా స్నేహాన్ని సంపాయించి, నానుంచి తనకు ఏ సహాయం జరిగే అవకాశముందో తెలుసుకోవాలని చాలా కుతూహలపడుతున్నారు. నేను గాలరీలలో అమర్చబడ్డ పెద్దహాలులోకి తీసుకుపోబడ్డాను. నా చుట్టూ మంచిరకం యూనిఫారాలు వేసుకున్న రాజభటులు, వారివెనుక రంగురంగుల దుస్తులు వేసుకున్న రాజోద్యోగులూ నిలబడి వున్నారు. అస్తమించబొయ్యే సూర్యుడు ఒక స్థానాన కూలబడ్డట్టు - ఒక పెద్ద ఎర్రనిముద్ద నాకు ఎదురుగా వుంది; ఆయన రత్నాభరణాల్ని ధరించి కదలిక అనేది లేకుండా నాకోసం ఎదురుచూసే రాజాగారు! అతని శరీరం మీద ఇరవై వేల రూపాయిల విలువగల రత్నాలన్నా ఉండి వుంటయ్. అతని కిరీటంమీద కూర్చున్న పెద్దరత్నం, చాలా కాలంక్రితం ప్రసిద్ధ ఢిల్లీ రాజులు ధరించిందే; వారి వారసుడుగా రాజాగారికి యీనాడు అర్హత వొకటి ఏర్పడ్డది.

అతనికి పాతికేళ్ళ వయస్సు ఉండొచ్చు. అతను శుద్ధహిందువుడైనా, ఆ రక్తంలో కొంత 'నీగ్రోతనం' వుందనే నా నిశ్చితాభిప్రాయం. అతని కళ్ళు పెద్దవైనా అందులో జీవంలేదు. బండబారిన పెదవుల వెనుక దాగిన వాడిపళ్ళను చిరునవ్వు ద్వారా లోకానికి చూపటం అతనికొక అలవాటు.

ఇంగ్లీషు పద్ధతిలోనే నాతో చెయ్యికలిపి, నన్ను అతని పక్కనే - పెద్ద కుర్చీమీద కూర్చోబెట్టాడు. అక్కడ కూర్చుంటే నా కాళ్ళు కింద ఆనక చాలా ఇబ్బందిపడ్డాను. నాగౌరవార్థం మర్నాటికి పెద్దపులి వేటను అతను నిర్ణయించాడు. యుద్ధాలూ, వేటలూ అంటే అతనికి చాలా యిష్టమట; ఇతర్లకు ఇవి మినహాగా ఇష్టాలంటూ ఉండటమే అతనికి ఆశ్చర్యంగా వుండేదట!

ఆ వేటలో నా కేమీ సంతోషం లేకపోయినా, అతని ఆనందానికి ఒక ప్రేక్షకుడిలాగు నటించక తప్పలేదు. అతని సహాయం నాకు చాలా అవసరం కనుక, అతని రుచుల్ని బాగా పొగిడాను. అతను చాలా సంతోషించి, వెంటనే నాకు తన వస్తాదుల బలాన్ని చూపాలనే కోరికతో - కోటలోని ఒక పెద్ద రంగస్థలానికి నన్ను తీసుకువెళ్ళాడు.

అతని ఆజ్ఞ కాగానే ఇద్దరు కండలు తేరిన శరీరంతో, దాదాపు దిగంబరులు గానే సిద్ధమయ్యారు. వారి చేతులకు పదునైన ఇనుపగోళ్ళు అమర్చబడి వున్నయ్. ఒకరి నొకరు ఎదుర్కొన్నారు. ఆ ఆయుధం చేసే గాయాల్లోంచి రక్తం స్వేచ్ఛగా, ధారలుకట్టి, వారి నల్లని శరీరాల మీంచి ప్రవహించసాగింది.

ఈ పోట్లాట చాలాసేపు జరిగింది. వారి శరీరమంతా గాయాలమయమైనా, వారింకా ఒకర్నొకరు చీల్చాలనే ప్రయత్నంలోనే ఉన్నారు. ఒకడి చెక్కిలి అంతా కొట్టుకుపోయింది; ఇంకోడి చెవ్విముక్కలై రాలిపోయింది. రాజాగారు మాత్రం సంతోషంతో పులకరించే శరీరాన్ని ఎగరేసుకుంటూ, తనకు తెలియకుండానే తన స్థానంనుంచే వారి చేష్టల్ని అనుసరిస్తూ, "ఇంకా కొట్టు - గట్టిగా కొట్టు!" అని హెచ్చరిస్తూనే వున్నారు.

చివరకు ఒకడు స్మృతి తప్పి పడిపొయ్యాడు. ఈ ఆనందం ఇంత త్వరగా అయిపోయినందుకు, రాజాగారికి చాలా విచారం కలిగింది. ఈ పెద్దపోట్లాట మీద అతను నా అభిప్రాయాన్ని అడిగాడు. నాకు చాలా చీదరగా వున్నా, పైకి మాత్రం అతన్ని చాలా మెచ్చుకున్నాను.

తరువాత నన్ను 'ఆనంద్ మహల్'కు తీసుకువెళ్ళమని ఆజ్ఞ యిచ్చాడు. ఈ మహల్ రాజాగారి ఉద్యానవనంలోవుంది. దాని ఒకగోడ చాలాకాలంనుంచీ సరస్సులో స్నానం చేస్తూనేవుంది. లోపల గాలరీలతో అమర్చబడ్డ పెద్ద నలు చదరపు హాలువుంది. ఈ భవన నిర్మాణంలో మంచిశిల్పం కనిపించింది. ఆ స్తంభాల మీది పనితనమూ, స్తంభాలకు అమర్చబడ్డ శోభాయమానమైన దీపాలూ - 'శిల్పకళ' అనే సరస్సునుంచి వెలువడ్డ రకరకాల కలువల్లాగు ఉన్నాయ్. పై నుంచి కిందిదాకా చూపబడ్డ శిల్పం నన్ను కట్టేసి, నాకంటికి తన్మయంచేసి - హిందూదేశపు కథల్నీ, ఆ దేశపు గొప్పతనాన్నీ చిన్నపిల్లాడికి బోధించినట్టు చేసింది. పాలరాతి నేలపైన పరచబడ్డ విలువైన తివాసీలు రాజాగారి శరీర మృదుత్వానికి నిదర్శనంగానే వున్నాయ్.

భోజనం పూర్తయేప్పటికల్లా - నాకూ రాజాగారికిమధ్య ఏర్పర్చబడ్డ అనువాదకుడు హరిబాద్ వచ్చి నాకు రాజాగారి రాకను తెలియబరిచాడు. రాజా గారు వేయిన్నొక్క విషయాల మీద మాట్లాడుతూ ప్రతిదానికీ నా అభిప్రాయాన్ని అడుగుతూ చాలా వేధించుకుతిన్నాడు. తరువాత ఉద్యానవనం అవతలి చివరవున్న కొన్ని శిధిలాల్ని నాకు చూపటానికి తీసుకువెళ్ళాడు.

అది రాళ్ళతోనూ చెట్లతోనూ నింపబడ్డ, కోతి తెగల నివాసభూమి. మేమీ ప్రదేశాన్ని సమీపిస్తుండగానే మగకోతులు విచిత్రమైన ముఖభంగిమలతో శిధిలమైన పెద్దగోడల పెకి ఎగబాకినై; ఆడకోతులు తమ పిల్లల్ని తీసుకొని తమ శక్తికొద్దీ పరుగెత్తినయ్. రాజాగారికి యీ దృశ్యం చాలా ఆనందంగా వుంది. అతను తన ఆనందాన్ని చూడమన్నట్టు నా పరాకును పారతోలేందుకల్లే - నన్నొకసారి గిచ్చి పెద్దగా నవ్వసాగాడు. ఆ శిధిలాల మధ్య మేము కూర్చున్నంత సేపూ కోతులు బారులుతీరి కోపంతో మావైపు చూస్తూనే వున్నాయ్. తనకు తృప్తి కలిగేదాకా యీ దృశ్యాన్ని చూసి, నా నీడలాగు నన్ను అంటిపెట్టుకొని - రోజూ నాకు ఇలాటి దృశ్యాల్ని

చూపుతూన్నందుకు తనలో తాను సంతోషిస్తూ రాజాగారు నడవసాగారు. మర్నాటికి నా గౌరవార్థం మరో పులివేట కూడా నిర్ణయించబడ్డది.

ఇలాటి పులివేటలు ఇరవై దాకా సాగినయ్. దేశం ఇవ్వగలిగిన జంతువులన్నీ చంపబడుతున్నయ్; చిరుతపులి, పెద్దపులి, ఏనుగు, ఎలుగ్గొడ్డు, మొసలి - ఒకటేమిటి - సృష్టిలో వున్న సగం జంతువులని నా నమ్మకం! అంత రక్తపాతంతో సంపాయించే యీ రకం ఆనందంతో నా తల దిమ్మెక్కింది.

రాజాగారికి తృప్తికలిగే సమయానికి - నా ప్రార్థనపైన నాపని చేసుకునేందుకు ఆయన నాకు కొంత విశ్రాంతిని ఇచ్చాడు. అమూల్యమైన ఆభరణాలూ, పెద్దరకం జంతువుల చర్మాలూ హరిబాద్ ద్వారా నాకు కాన్కలుగా పంపబడ్డయ్. హృదయంలో నేనంటే హరిబాద్ ఏవగించుకుంటూన్నా, రాజా గారి సేవకుడు కనుక అతడు పైకి నన్నొక దైవంలాగు చూడక తప్పిందికాదు. ప్రతి రోజూ విలువైన కొత్తరకం భోజన పదార్థాలు నాకు పంపబడేవి. నా ఆనందం కోసం ప్రతిరోజూ - నాట్యాలూ, గారడివిద్యలూ, సైన్యాల్ని పరీక్షించటమూ - మొదలైన వినోదాలు ఏర్పాటు చేయబడేవి. ఇవన్నీ నాకు ఏమాత్రమూ ఇష్టంలేక పోయినా నన్ను ఇంతగా గౌరవిస్తూన్న రాజాగారి హృదయాన్ని గాయపరచకుండా ఉండేందుకు తృప్తిని నటిస్తూ వచ్చాను.

నాకు కాస్త తీరిక దొరికినప్పుడల్లా నా పనిని చేసుకునేవాణ్ణి; తప్పితే వాటి ప్రభువుకన్న నాకు ఎక్కువ ఆనందాన్ని ఇవ్వగలిగే కోతులగుంపుల స్నేహంకోసమైనా వెళ్ళేవాణ్ణి.

ఒకనాటి సాయంత్రం షికారు వెళ్ళి వచ్చేప్పటికల్లా హరిబాద్ 'ఆనంద్‌మహల్' ముందు నాకోసం నిలబడివున్నాడు. వాడు రహస్యంగా - నాకోసం రాజాగారి కొత్త బహుమానం లోన ఎదురుచూస్తోందనీ, చాలా కాలంనుంచీ నేను కోల్పోతూన్న ఆనందాన్ని ఇవ్వటంలో ఇంత ఆలస్యమైనందుకు రాజాగారు క్షమ కోరారని చెప్పి, నమస్కరించి వెళ్ళిపొయ్యాడు.

నేను లోపలికి వెళ్ళేప్పటికి ఆరుగురు చిన్నపిల్లలు వరసాగ్గా గోడకు ఆనుకొని కదలికలేకుండా నిలబడివున్నారు. వారిలో పెద్దదానికి పదేళ్లూ, చిన్నదానికి ఎనిమిదేళ్లూ వుంటై. ఈ గరల్స్ స్కూలును నాగదిలో పెట్టటంలోని అర్థం నాకు మొదట తెలియలేదు. కాస్త ఆలోచన మీద రాజాగారి లేత హృదయాన్ని బాగా అర్థం చేసుకోగలిగాను. నా మీద అతనికి వున్న దయవల్ల చిన్నపిల్లల జనానాను నాకు కాన్కగా పంపారు. పండేందుకు సిద్ధంగావున్న కాయలకు గొప్ప వారి దృష్టిలో విలువ ఎక్కువ కాబోలు!

కొంతసేపటివరకూ - నేను ఏ ఆజ్ఞ ఇస్తానోననే భయచూపుల్ని చూసే యీ పసికూనల్ని చూస్తూ - సిగ్గుతోనూ, ఆశ్చర్యంతోనూ గడిపాను. వారికి ఏం చెప్పాలో నాకు తెలియలేదు. వారిని తిరిగి పంపేస్తే రాజాగారి బహుమతిని నిరాకరించి

నట్టవుతుంది. తప్పని సరిగా యీ చిన్నపిల్లల్ని నా భవనంలో నేనే ఖైదు చెయ్యాల్సి వచ్చింది.

వారు నిర్జీవ ప్రతిమల్లాగు నా కళ్ళల్లో తమ కేమైనా అర్థమయ్యే భావాలు కన్పిస్తయ్యేమోనని చూస్తున్నారు. ఈ వికృతమైన బహుమతిని చూస్తూ కూర్చుంటే నాకే నవ్వు వచ్చేట్టుందని అందరిలోకీ పెద్దామెను, "నీ పేరేమిటి?" అని అడిగాను.

"ఛాలీ!" అని జవాబు చెప్పింది.

ఆమె ఏం చెప్తుందోనని, "నువ్విక్కడికి ఎందుకొచ్చావ్?" అన్నాను.

మృదువైన కంఠధ్వనితో ఆమె అంది : "నా యజమాని ఏం చెప్తే అది చేద్దామని-"

ఇదే ప్రశ్నను అందరిలోకీ చిన్నామెను అడిగితే. "మీరుకోరింది చేసేందుకు-" అని జవాబు చెప్పింది.

ఈ చిన్నపిల్ల, ఎలుకను జ్ఞాపకం చేస్తోంది; ఆమెను తీసుకొని ముద్దు పెట్టుకున్నాను. నేను నా ఇష్టప్రకారం ఎన్నుకొన్నా ననుకున్నారు కాబోలు - మిగతా వారందరూ విరమించే ప్రయత్నంలో వున్నారు. కాని అందర్నీ ఉండమని, నేను హిందువులాగే కూర్చుని వారిని నాచుట్టూ కూర్చో బెట్టుకొని, ఇప్పటికి ఒక మాదిరిగా నేర్చుకున్న వారి భాషలో దేవకన్యకథల్ని చెప్పనారంభించాను. అందరూ సంతోషంతో చప్పట్లుకొడుతూ వినసాగారు. పాపం - వాళ్ళు నా దగ్గరకు ఎందుకు పంపబడ్డారో మరిచిపోయి నట్టుంది!

కథ పూర్తయ్యాక - నావెంట తెచ్చుకున్న సేవకుణ్ణి పిలిచి, మిఠాయీ, రొట్టెలో తెమ్మన్నాను. వారందరూ కడుపునిండా తిన్నాక - యీ నా గమ్మత్తు భార్యల్తో ఆటలాడు కోవాలనిపించింది. వారితోపాటే సంతోషంతో కేకలు పెడుతూ, నా వయస్సే మరిచి ఆటలాడుకోవటం చూస్తే, చాలా కాలంనుంచీ నిద్రపోతూన్న యీ గొప్ప భవనానికి కూడా - వెంటనే జాగ్రదావస్థలోపడి ఆ పిల్లలతోపాటే ఆటలాడుకోవాలనిపించదా అనే అనుమానం కలిగింది! వారు అలసిపొయ్యే సమయానికి వారి పక్కల విషయం చూశాను. ఈ సుల్తానాల రక్షణార్థం పంపబడ్డ నలుగురు దాసీల సహాయంతో - ఈ అమాయకపు ఉంపుడుకత్తెలు హాయిగా పడుకునే ఏర్పాటు చెయ్యగలిగాను.

వారంరోజులవరకూ ప్రాణంవున్న యీ ఆటవస్తువుల తండ్రిగా ఉండటంలోని ఆనందాన్ని రుచి చూశాను. దాగుడుమూతల ఆటలతో మా కాలం హాయిగా గడిచిపోయింది. మా దేశపు ఆటల్నికూడా రోజు కొకటి చొప్పున వారికి నేర్పాను.

ఛాలి మర్యాద తెలిసిన తెలివైన పిల్ల. యూరపియన్ నీతిని చూసి అనుమా నిస్తూన్నట్టు కాస్త సిగ్గుతోనే నన్ను అమితంగా ప్రేమించసాగింది. నేనే ఆమె తండ్రినైనట్టుగా ఆదరించసాగాను. మేమందరమూ శిధిలమైన కోట భాగాల్లోని కోతులతో త్వరలోనే స్నేహాన్ని సంపాయించి కాలాన్ని గడిపాము.

ఒకనాడు పెద్ద పళ్ళెంలో పళ్లూ రొట్టెలూ తీసుకొని కోతుల నివాసభూమికి వెళ్లాను. తమకన్న ఎక్కువగా భయపడే చిన్నపిల్లల్ని వెంటేసుకొని - కోతులు నాకు కాస్త దూరంలో వలయాకారంలో కూలబడి, అంతకన్నా దగ్గరకు రావటం తమకు చేతకాదన్నట్టూ, నన్నే ఆ రొట్టెలన్నీ పంచమన్నట్టూ చూడసాగాయ్. కాని ఒక పెద్ద మగకోతి - మిగతా వాటికన్న ధైర్యంతో భిక్షకుడిలాగు చాచిన చేతితో నన్ను సమీపించి, నేను ఇచ్చిన రొట్టెను తీసుకొని - భార్య దగ్గరకు కాబోలు పరుగెత్తింది. ఇది చూసి మిగతా కోతులన్నీ యీర్ష్యతో కూడుకొన్న కోపంతో అరవసాగాయ్. ఆ మోత భరించలేక, అన్నింటికీ రొట్టెలు పంచాను.

నాకు యీ శిధిలాలమధ్య హాయిగా ఉండటంవల్ల - నా పనిముట్లను వెంట తెచ్చుకొని ఇక్కడే పరిశోధనలు చేసేవాణ్ణి.

చాలా సాయంత్రాలు ఛాలీతో ఆ సరస్సుగట్టున గడిపాను. ఆమె నా కాళ్ళపైన పడుకొని కళ్ళలోని పూర్వీకుల రాజఠీవిని పోనీకుండా, యితర ప్రపంచాన్ని గూర్చే ఆలోచించేది కాదు. ఆమె ముఖంలోకి చూస్తూంటే, నాకు పవిత్రమైన విగ్రహాలు జ్ఞాపకమొచ్చేవి. ఒక రాత్రి చంద్రుని ప్రకాశ కిరణాలు నీటిపై పడి మెరిసే తెలుపును ఇద్దరమూ మౌనంలోనే అనుభవించాం. ఆలోచనలో పడ్డ ఛాలీ చిన్న తలను రెండు చేతులతోనూ తీసుకొని, విశాలమైన ఆమె ఫాలభాగంమీదా, సన్నని పెదవులపైనా, ఈ భూభాగంలోని పూర్వీకుల రహస్యాలన్నీ దాగివున్న ఆ పెద్ద కళ్ళమీదా ముద్దు పెట్టుకున్నాను. కవిత్వ తన్మయత్వానికి పైనవున్న దేదో నన్ను ఆవరించింది. ఈ ఒక్క చిన్నపిల్ల ద్వారా - వారి జాతంతా నాదే ఐనట్టుగా తోచింది.

రాజాగారు పంపే కానుకలు రోజురోజుకూ బరువౌతూనే వున్నాయ్. ఒకనాడు అతను - నేను ఊహించని వస్తువును పంపాడు. అది ఆలుచిప్పలు పైన అతుకబడ్డ అట్టపెట్టె; యూరప్‌లోని సముద్రపుటొడ్డు కొట్లల్లో అది అణా, బేడకు తేలిగ్గా లభ్యమవుతుంది. కాని అతి విలువైన రత్న మొకటి ఆ పెట్టెపైన మధ్యగా అతుకబడి వుంది. ఛాలీలో ఆ పెట్టె గొప్ప చలనాన్ని కలిగించింది.

మామూలు బజారు అట్టపెట్టెమీద అతుకుబడ్డ యీ విలువైన రత్నాన్ని గూర్చి ఆశ్చర్యపడుతూ దాన్ని నా టేబిల్‌మీద వదలిపెట్టాను. కాని ఛాలీ ఎప్పుడూ దానివైపే చూస్తూ తనలో తను తన్మయత్వం చెందేది.

అప్పుడప్పుడు ఆమె నన్ను, "నేను దాన్ని ముట్టుకోవచ్చా?" అని అడిగేది.

నేను ఒప్పుకోగానే పెట్టె దగ్గరకు పరుగెత్తి, మెల్లగా మూత ఎత్తి, జాగర్తగా మూతవేసి, పైభాగాన అమర్చబడ్డ ఆలి చిప్పల్ని సున్నితంగా ముట్టుకునేది; ఆ స్పర్శ ఆమెకు నిజమైన ఆనందాన్ని యిస్తోందని ఆమె కళ్ళే చెప్తున్నాయ్.

నా పని పూర్తి అయి నేను వెళ్ళిపొయ్యేకాలం సమీపించింది. ఈ చిన్నపిల్లను వదిలి వెళ్ళబుద్ధి కాలేదు. కాని తప్పనిసరిగా ఒక రోజు తిరుగు ప్రయాణానికై నిశ్చయించాను.

ఛాలీనుంచి విడిపోతూన్నప్పుడు, నా హృదయం ద్రవించింది. ఆమె తన తలను నా రొమ్ముపైన ఆనించి వెక్కివెక్కి, ఒణుకుతూ ఏడ్చింది. ఆమెను ఎలా ఓదార్చాలో నాకు తెలియలేదు. నా ముద్దులు పని చెయ్యటం మానుకున్నయ్.

చివరకు ఆలోచించి, రాజాగారు పంపిన పెట్టెను ఆమెకు యిస్తూ, "ఇది - నీది-" అన్నాను. అప్పటికి కాని ఆమె పెదవుల మీద చిరునవ్వు కన్పించలేదు. కలలోకూడా సంభవం కావనుకున్నవి, వాస్తవిక జీవితంలో జరిగినప్పుడు - మానవుడుపొందే ఆనందంలాంటిది ఆమె ముఖాన్నంతటినీ ఆవరించింది. ఐనా కూడా నేను ఆ స్థలాన్ని విడిచే వరకూ ఆమె దుఃఖిస్తూనే వుంది. కాని కటిక గుండెతో తప్పనిసరిగా నేను ఇంటిముఖం పట్టాల్సి వచ్చింది.

## 2

రెండు సంవత్సరాలు గడిచాక, ఇంకో సందర్భంలో నేను బొంబాయి వెళ్ళాను. నాపనిని త్వరగా పూర్తి చేసుకొని, మిగతా కాలాన్ని రాజామదన్ గారితోనూ, ఇప్పటికి పూర్తిగా మారిపోయిన ఛాలీతోనూ గడపాలని నిశ్చయించాను.

రాజాగారు నన్ను పూర్వంకన్న ఎక్కువ గౌరవంతో ఆహ్వానించి మొదటి రోజంతా నన్ను వదలనేలేదు. ఆ రాత్రి హరిబాద్‌ను పిలిపించి, కాస్సేపు అవ్వీ, ఇవ్వీ మాట్లాడి "కిందటిసారి నేను ఇక్కడికి వచ్చినప్పుడు రాజాగారు నాకు గాను పంపిన ఛాలీ ఇప్పుడెక్కడవుంది?" అని అడిగాను. వెంటనే అతని ముఖంలో వ్యాకులతతో కూడిన విచారం కనిపించింది.

"మనం ఆ విషయం మాట్లాడుకోకపోవటం మంచిది-" అన్నాడు, మెల్లిగా.

"ఏం - ఆమె చాలా మంచిదే?"

"కాని చాలా చెడిపోయిందండీ?"

"ఛాలీయా?...ఏమైంది? ఇప్పుడెక్కడవుంది!"

"అంటే...ఆమె అంత్యదశ - చాలా చెడుగా పరిణమించింది."

"అంత్యదశా? ఆమె చనిపోయిందా?"

"అవును...ఆమె ఘోరమైన తప్పుపని చేసింది."

నాకు చాలా బాధ కలిగింది. నా గుండె కొట్టుకునే శబ్దాన్ని నేను బాగా వినగలుగుతున్నాను. అంత విచారంలోనూ - ఆమె ఏం చేసిందో, ఆమెగతి ఏమైందో తెలుసుకోవాలని హరిబాద్‌ను అంతా చెప్పమని ఒత్తిడి చేశాను.

వాడు బాధగా ఒకసారి కళ్ళుమూసి, అస్పష్టంగా "ఆ విషయం మీరు అడగకుండా ఉండటమే మంచిది" అన్నాడు.

"కాని నాకు తెలుసుకోవాలని వుంది."

వాడు కాస్త ఆగి, "ఆమె దొంగతనం చేసింది" అన్నాడు.

"ఎవరూ? ఛాలీయా? ఏం దొంగిలించింది?"

"మీకు సంబంధించిన వస్తువు-"

"నా వస్తువా?" అన్నాను, ఆశ్చర్యంతో.

"అవును...మీరు ఇక్కణ్ణుంచి వెళ్ళబొయ్యే ముందు, రాజాగారు మీకు బహూకరించిన ఆ చిన్నపెట్టి - ఆమె చేతుల్లో ఉండగానే పట్టుకున్నారు."

"ఏ పెట్టె?"

"ఆలిచిప్పలు అతుకబడ్డ పెట్టె-"

"కాని అది నేను ఆమెకు ఇచ్చానే!"

హరిబాద్ నావైపు ఆశ్చర్యంతో చూసి అన్నాడు: "ఎన్నో పవిత్రమైన ప్రమాణాలతో ఆమె అదే చెప్పింది. కాని రాజాగారి బహుమతిని బానిసదానికి మీరిచ్చివుంటారనే విషయాన్ని ఎవరూ నమ్మలేకపొయ్యారు. అందుకే ఆమెకు - శిక్ష"

"ఏం శిక్ష? ఆమెను ఏం చేశారు?"

"ఒక గోనెసంచిలోవేసి బిగించికట్టి, యీ ద్వారంలోంచి, కింది సరస్సులోకి విసిరివేశారు-"

జీవితంలో ఇంతవరకూ అనుభవించని విచారమంతా నన్ను బాధించసాగింది. హరిబాద్ నా కన్నీటిని చూడకుండా ఉండేందుకు, వెళ్ళిపొమ్మని సౌజ్ఞ చేశాను.

ఆ ద్వారం దగ్గర కూర్చుని ఆ రాత్రంతా ఆ సరస్సులోకే చూడసాగాను. ఈ ద్వారం దగ్గరే ఆమె నా కాళ్ళపైన పడుకొని ఆడుకునేది. ఇప్పుడు గోతాంలో నశించిపోయిన ఆమె శరీరాన్ని - యీ సరస్సు అడుగు భాగాన ఉన్నట్టు ఊహించుకున్నాను - ఎంత బాధ!

రాజగారు ఎంత బతిమాలినా, చివరకు ఆయన నాపైన కోపం వచ్చేట్టున్నా లెక్క చెయ్యకుండా - మర్నాడే తిరిగి వచ్చేశాను.

ఆనాటినుంచీ యీనాటివరకూ జీవితంలో నేను ఛాలీని తప్ప ఇంక ఏ ఇతర స్త్రీని ప్రేమించనట్టే తోస్తుంది.